క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన

సామర్లకోట: స్థానిక బచ్చుఫౌండేషన్ మునిపల్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. మాజీ ఎమ్మెల్యే బొడ్డు భాస్కరరామారావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా రక్తదాన, కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, ఎముకలు, కీళ్ల, గుండె వ్యాధులు, ఈసీజీ, బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. మదర్ థెరిస్సా వలంటరీ సంస్థ అధినేత జి.రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, భాస్కరరామారావు తనయుడు బొడ్డు వెంకటరమణచౌదరి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఈ-కేవైసీ తప్పనిసరి

పిఠాపురం: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నియోజకవర్గ పరిధిలోని సర్వీసు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని పిఠాపురం సబ్ ట్రెజరీ అధికారి ఎండీ అహ్మద్ సూచించారు. నియోజకవర్గ పరిధిలో 1081 మంది పెన్షనర్లు ఉండగా ఇప్పటివరకు 465 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారన్నారు. మిగిలిన వారు ఈ నెల 10వ తేదీ లోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఉమారామ లింగేశ్వరస్వామి కల్యాణం


గోర్సలో కల్యాణ అలంకరణలో రామలింగేశ్వర స్వామి

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో వేంచేసిన ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. వేద పండితులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రికి స్వామి, అమ్మవార్ల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొనసాగుతున్న ఎంపీడీఓల శిక్షణ


ఎంపీడీఓలకు శిక్షణ ఇస్తున్న మల్లికార్జునరావు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నూతన ఎంపీడీఓల శిక్షణ కొనసాగుతోంది. ఈనెల 31 వరకు వారు శిక్షణ పొందనున్నారు. ఫ్యాకల్టీ టి.మల్లికార్జునరావు జిల్లా అధికారులతో అనుసంధానం, ప్రభుత్వ ఉద్యోగులు కార్యాలయంలో నిర్వహించాల్సిన విధులు, ఫైల్స్ నిర్వాహణ, ఆడిట్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈటీసీ వైస్ ప్రిన్సిపల్ ఇ.కృష్ణ మోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, జి.శ్రీదేవి, ఎంఎస్ఎన్ రెడ్డి, కేఎస్ఆర్ నిహారిక, బి.వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, బి.ఆంజనేయులు శిక్షణలో పాల్గొన్నారు.

వలసలు నివారించాలి


ఆనూరులో నిరసన తెలియజేస్తున్న రైతుకూలీలు

పెద్దాపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల కోసం దూర ప్రాంతాలకు వెళ్తున్న కూలీల వలసలను అరికట్టాలని ఏపీ రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు అన్నారు. మండలంలోని ఆనూరు గ్రామంలో అల్లూరి సీతారామరాజు నగర్‌లో మేడే వారోత్సవాల్లో భాగంగా ఆనూరు దళితపేటలో ఆందోళన చేశారు. రాజుబాబు మాట్లాడుతూ దళితపేటలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తొలుత మేడే పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రమేష్, సతీష్, బత్తిన బుల్లి సత్తిబ్బ తదితరులు పాల్గొన్నారు.

డిప్లమో ఇన్ లాంగ్వేజ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు: సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ 10 నెలల డిప్లమో ఇన్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ మంగళవారం తెలిపారు. తరగతులు జూలై ఐదో తేదీ నుంచి ప్రారంభమవుతాయనని, ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మామిడాడ గ్రామ శివారులో పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురుని అరెస్టు చేసి వారి నుంచి రూ.1200 స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

అకాల వర్షం.. అపార నష్టం

- తడిసి ముద్దయిన వరి పంట
- వాణిజ్య పంటలకూ భారీగా నష్టం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


గొల్లప్రోలు మండలంలో వరి పనల్లోకి చేరిన నీరు

పిఠాపురం: అకాల వర్షాలకు అన్నదాత విలవిల్లాడుతున్నాడు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. నీరు పొలాల్లో నిలిచిపోవడంతో పంటలకు నష్టం కలిగింది. గతంలో ఎదురైన కష్టనష్టాలను మరవకుండానే రైతులకు మరో విపత్తు ఎదురైంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో వర్షం రైతులకు తీరని నష్టం చేకూర్చింది.

ఆశలు ఆవిరి

ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో ఆది నుంచి రబీ సాగు సజావుగా సాగింది. పంట కూడా బాగా పండింది. తమ కష్టాలు తీరతాయని రైతులు భావించగా వారి ఆశలపై అకాల వర్షం నీళ్లు చల్లింది. ఫలితంగా వేలాది ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది.

38 వేల ఎకరాల్లో..

పిఠాపురం నియోజకవర్గపరిధిలో పీబీసీ, ఏలేరు, ఆర్ఆర్‌బీ ట్యాంక్, చెరువులు, బోర్ల కింద సుమారు 38 వేల ఎకరాల్లో ఈ ఏడాది రైతులు దాళ్వా సాగు చేశారు. ప్రస్తుతం 70 శాతం కోతలు పూర్తయ్యాయి. రైతులు ఇప్పుడిప్పుడే కుప్పలు వేయడం మొదలుపెట్టారు. ఈ దశలో వర్షం కురవడంతో పనలపై ఉన్న వరి పంట తడిసి ముద్దయ్యింది. కళ్లాల్లో ఉన్న ధాన్యం చుట్టూ నీరు చేరింది. పల్లపు ప్రాంతాల్లోని వరి పనలు నీట మునిగాయి. ఇంకా కోత కోయని వరి చేలు నేలనంటాయి. మరో 24 గంటల పాటు వర్షం పడినట్లయితే పనలపై ఉన్న వరి చేలు మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను ఎడ్లబళ్లపై తరలిస్తున్నారు. పండిన పంటను దక్కించుకునేందుకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలకు పిఠాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాలు అతలాకుతలమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొత్తపల్లి మండలంలోని తీర ప్రాంతంలో వర్షాలకు ఎండు చేపలు నీట మునిగి మత్స్యకారులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. కొత్తపల్లి ఎస్సీ కాలనీ, ఉప్పాడ శివారు వీధులు వరద నీటి లో చిక్కుకున్నాయి. ఉప్పాడ, మూలపేట, వాకతిప్ప, కొత్తపల్లి, అమీనాబాద్ గ్రామాల్లోని చేనేత కుటుంబాల పడుగు పనులు నిలిచిపోయాయి.

2 వేల ఎకరాల్లో వాణిజ్య పంటల సాగు

అకాల వర్షం వల్ల వాణిజ్య పంటలకు తీరని నష్టం జరిగే అవకాశం ఉంది. గొల్లప్రోలు మంలంలోని గొల్లప్రోలు, చేబ్రోలు, దుర్గాడ, ఎ.విజయనగరం, చెందుర్తి, తాటిపర్తి గ్రామాల్లో రైతులు సుమారు 2 వేల ఎకరాల పైబడి వాణిజ్య పంటలు సాగు చేశారు. కోతదశలో ఉన్న సమయంలో వర్షం కురవడంతో భారీ నష్టం సంభవించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు నువ్వుచేలను కోసి గుట్టలు వేశారు. వర్షం అదుపులోకి రాకపోతే గుట్టలు కుళ్లిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలి. ధాన్యం రాశులను టార్పాలిన్, బరకాలతో కప్పాలి. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటల పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు ఇస్తున్నాం. పూర్తిగా వానలు తగ్గే వరకు రైతులు ధాన్యం రాశులను ఆరబెట్టకుండా పూర్తి రక్షణలో భద్రపర్చుకోవాలి.

సత్యనారాయణ,
వ్యవసాయశాఖాధికారి, గొల్లప్రోలు


కొత్తపల్లిలో కురుస్తున్న వర్షం


ఏకే మల్లవరంలో ధాన్యం రాశులకు రక్షణ కల్పిస్తున్న రైతు


గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో నేలనంటిన వరిచేలను నిలబెడుతున్న రైతులు

వరిపై వారుణాస్త్రం

- వర్షాలకు పడి పొయిన చేలు
- ధాన్యం రాశులను ఆరబెడుతున్న అన్నదాతలు


వీకే రాయపురంలో వర్షానికి తడిసిపోయిన వరిపనలు

సామర్లకోట: వాతావరణం గంటకో మాదిరిగా రైతులతో ఆటలాడుతోంది. సోమవారం కురిసిన వర్షానికి రైతుల ధాన్యం రాశులు మంగళవారం ఎండ రావడంతో రోడ్లపై ఆరబెట్టుకున్నారు. అయితే వర్షం తిరిగి ప్రారంభం కావడంతో రైతులు పరుగులు తీసి ధాన్యం తడిసిపోకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పారు. మండల పరిధిలో సుమారు 80 శాతం వరకు రైతులు బొండాలు వేశారు. దాంతో ఎకరానికి 60 బస్తాలకు మించి దిగుబడి వచ్చేలా వరి చేలు కళకళలాడుతున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షాలు రావడంతో వరి కంకుల బరువుకు వరి చేలు పడిపోయి నీటిలో మునిగిపోయాయి. దాంతో ధాన్యం రాలిపోయి దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు వాపోయారు. ధాన్యం నీటిలో తడిసిపోవడంతో మొలకలు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సామర్లకోటలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

నష్టపోకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

మిల్లర్ల సమావేశంలో తహసీల్దార్


మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి

సామర్లకోట: ప్రభుత్వ సూచనల మేరకు మిల్లర్లు నష్టపోకుండా, రైతులకు అనుకూలంగా ఉండేలా ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ ఎల్ఎల్‌వీ కుమారి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మిల్లర్లతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు మిల్లర్లు సహకరించాలన్నారు. బ్రోకెన్ శాతం 30 దాటితే తప్ప ఎవ్వరికీ తగ్గుదల లేకుండా చూడాలని మిల్లర్లను కోరారు. మిల్లుల వద్దకు వచ్చిన పంటని వేగంగా అన్‌లోడింగ్ చేయాలన్నారు. తేమ శాతానికి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత వ్యవసాయ శాఖ ఏడీ జీవీ పద్మశ్రీ, ధాన్యం కొనుగోలు ప్రత్యేక అధికారి పి.వసంత మాధవి, మండల వ్యవసాయాధికారి ఐ. సత్య, వీఆర్వో, వీపీఏలు, మిల్లర్లు పాల్గొన్నారు.

పాలనపై శిక్షణలో అసిస్టెంట్ కలెక్టర్


అసిస్టెంట్ కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీడీఓ తదితరులు

సామర్లకోట: అసిస్టెంట్ కలెక్టరు ప్రఖార్ జైన్ మంగళవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణకు హాజరయ్యారు. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయంలో సుమారు నెల రోజుల పాటు ఆయన శిక్షణ పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మండల పరిషత్ కార్యాలయానికి హాజరైన ఆయనకు ఎంపీడీఓ డి.శ్రీలలిత ఆధ్వర్యంలో సిబ్బంది స్వాగతం పలికారు. కార్యాలయ విధులు, అధికారులు, గ్రాంట్ల వివరాలు, పనుల వివరాలు, మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నికల ప్రక్రియ, వివిధ శాఖలతో సమన్వయం తదితర అంశాలను ఆయనకు వివరించారు. ఈఓ పీఆర్డీ వై.శ్రీహరి, పరిపాలనాధికారి వి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు


ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు: న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ప్రత్తిపాడు కోర్టులో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య ఆధ్వర్యంలో స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో నిరసన ప్రదర్శన, ధర్నా చేపట్టారు. స్థానిక బార్ అసోసియేషన్ సభ్యుడు యార్లగడ్డ శ్రీనివాసరావుపై రాజమహేంద్రవరం జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రతివాదికి చెందిన వ్యక్తులు చేసిన దాడిని ఖండించారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని, న్యాయవాదులపై దాడులకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ ప్రతినిధులు బొంగులూరి మధుబాబు, మళ్ల గంగాధర్, సూర్య ప్రకాష్, రాయి శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు కొల్లా వీర్రాజు, ఎ.కుక్కుటేశ్వరరావు, చెలంకూరి రామకృష్ణ, పిల్లి బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

అవిశ్రాంత సేవలు అభినందనీయం


వేసవి వినోద-విజ్ఞాన కార్యక్రమంలో మాట్లాడుతున్న సోమన్నచౌదరి

సామర్లకోట: విశ్రాంత ఉపాధ్యాయుడు కృష్ణశ్రీ సేవలు అభినందనీయమని జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి అన్నారు. మంగళవారం సాయంత్రం మాధవపట్నం శివారు జమునానగర్‌లో జరిగిన వేసవి వినోద-విజ్ఞాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా ఎన్నో కార్యక్రమాలు చేసిన కృష్ణశ్రీ పదవీ విరమణ తరువాత కూడా రెట్టించిన ఉత్సాహంతో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కృష్ణశ్రీ మాట్లాడుతూ పిల్లల కోసం పని చేయడంలో అలసట ఉండదని, కాకినాడ జన విజ్ఞాన వేదిక, స్థానిక బాల మందిరం సంస్థల సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాధవపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయిని పి.సత్యవేణి బాలబాలికలకు కాగితాలతో వివిధ రకాల బొమ్మలు చేయడంలో శిక్షణ ఇచ్చారు. స్థానిక తోలు బొమ్మలాట కళాకారుడు గణపతిరావు పద్య పఠనం ద్వారా పిల్లలను అలరించారు. ఈనెల 8వ తేదీ వరకు శిక్షణ శిబిరం కొనసాగుతుందని కృష్ణశ్రీ తెలిపారు.

సామూహిక లక్ష్మీనారాయణ వ్రతం


ఎస్.అన్నవరంలో సామూహిక లక్ష్మీనారాయణ వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సామూహిక లక్ష్మీనారాయణ వ్రతం నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు, మహిళలు సాంప్రదాయబద్ధంగా వ్రతాన్ని ఆచారించారు. సాయంత్రం స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. బుధవారం ఉదయం చతుస్థానార్చన, మూలమంత్ర హవనం, లఘు పూర్ణాహుతి, సాయంత్రం పండిత సదస్యం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఈ నెల 5న సుదర్శన నారసింహ హోమం, మహా పూర్ణాహుతి, శ్రీచక్ర స్నానం, శ్రీపుష్పయాగంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

ఆకతాయిల చిల్లరపని


నీటి సరఫరా కోసం రోగుల బంధువుల పడిగాపులు

- ఇనుప కాయిన్‌తో నీరు తీసుకునేందుకు యత్నం
- జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన యంత్రానికి మరమ్మతులు
- ఇబ్బంది పడిన రోగులు, వారి బంధువులు


మల్టీకాయిన్ మానిటర్‌లో ఇరుక్కున్న ఇనుప నాణాలివే...

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో 'చిల్లర'గాళ్ల నిర్వాకం రోగులను ఇబ్బందుల పాలుచేసింది. మాతాశిశు విభాగం ఆవరణలో కొనసాగుతున్న ఎస్ఎఫ్‌సీఎల్ మంచి నీటి ఆర్‌ఓ ప్లాంటు కేవలం రూ.1 నామ మాత్రపు రుసుముతో లీటర్ పరిశుభ్రమైన నీటిని అందిస్తూ ఎందరో రోగుల దాహార్తిని తీరుస్తోంది. మంగళవారం ఆ రూపాయి కూడా చెల్లించేందుకు మనసొప్పని ఆకతాయిలు ఇనుప నాణాలు వేసి నీళ్లు పట్టే ప్రయత్నం చేశారు. ఒక కాయిన్ వేస్తే ఫలితమేమీ లేకపోయేసరికి మరో కాయిన్ వేసి మరీ ఆ యంత్రాన్ని చెడగొట్టారు. దీంతో రోగులు, వారి బంధువులు ప్రత్యామ్నాయాల వెంట పడాల్సి వచ్చింది. నిర్వాహకులు ఎందుకు నీటి సరఫరా ఆగిందో తెలియక గందరగోళానికి గురై కాయిన్ బాక్స్ తెరిస్తే రూపాయి నాణాలను పోలి ఉన్న రెండు ఇనుప నాణాలు మానిటర్‌లో ఇరుక్కుపోయి ఉండడాన్ని గమనించారు. ఆకతాయిల పనికి అసహనం వ్యక్తం చేసి మరమ్మతులకు పరుగులెట్టారు.

ఏపీఎస్పీలో వేసవి శిక్షణ ప్రారంభం

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట మూడో ఏపీఎస్పీ బెటాలియన్ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని కమాండెంట్ సీహెచ్ విజయరావు దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు శిబిరంలో ఏర్పాటు చేసిన కార్యకలాపాలన్నీ ఉత్సాహంగా నేర్చుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్ భద్రయ్య, బెటాలియన్ అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్, అసిస్టెంట్ కమాండెంట్ పి.సత్యం, ఇతర అధికారులు, స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల అందజేత

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.ప్రశాంతి ఆధ్వర్యంలో మంగళవారం క్షయ వ్యాధిగ్రస్తులకు రిలయన్స్ ఆర్థిక సాయంతో పోషకాహార కిట్లను అందించారు. తాళ్లరేవు, తూరంగి, కరప ప్రాంతాలకు చెందిన 24 మందికి ఒక్కొక్కరికి రూ.700 విలువైన కిట్లను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ జిల్లా కోఆర్డినేటర్ టి వెంకటేష్, ఎంపీహెచ్ఈవో పీవీ ప్రసాదరావు, ఎంపీహెచ్ఎస్ రాజశేఖర్, సామ్రాజ్యం, విజయకుమారి, గోవిందరావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతి ప్రయోజనం కోసమే ఉద్యమించాం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జాతి ప్రయోజనం కోసం ఉద్యమం చేశాం తప్ప వ్యక్తిగత ప్రయోజనం కోసం కాదని ఆంధ్ర రాష్ట్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కాపు ఏజేసీ కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. తుని రైలు దహనం కేసు కొట్టివేయడంపై కాపు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ కాకినాడ కాపు కల్యాణమండపంలో మంగళవారం సంబరాలు చేసుకున్నారు. తుని రైలు దగ్ధం కేసులో అమాయకులు ఏడేళ్లుగా మనోవేదన అనుభవించారన్నారు. రానున్న కాలంలోను కాపులంతా కలిసి పనిచేస్తామన్నారు. కాపులపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు కేసులు ఉన్నాయని వాటిని కూడా ఎత్తివేయాలన్నారు. అనంతరం సంఘం అధ్యక్షులు వీవై దాసును కాపు నాయకులు సత్కరించారు. సంఘ నాయకులు చిట్నీడి శ్రీనివాస్, బసవా ప్రభాకరరావు, సలాది మూర్తి, పి.సేతుమాధవరావు, శిద్ధు నూకరాజు, పెద్దిరెడ్డి రామలక్ష్మి పాల్గొన్నారు.

ఉప్పరగూడెంలో జగనన్నే మా భవిష్యత్


ఉప్పరగూడెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి శివారు ఉప్పరగూడెంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఉప సర్పంచ్ గుర్రాల చిరంజీవికుమార్, గ్రామ కన్వీనర్ గుర్రాల ఏసేపు ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు స్టిక్కర్లు అతికించారు. గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి, ప్రభుతం అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్లు జక్కి తనుశ్రీ, సన్నిబోయిన సుధ, సన్నిబోయిన జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి: స్థానిక మహిళా సమైక్య కార్యాలయంలో యానిమేటర్‌గా పని చేస్తున్న కొచ్చర్లపాటి గాయత్రి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లికి చెందిన గాయత్రి కొంతకాలంగా యనిమేటరుగా పనిచేస్తోంది. తనతో పాటు పనిచేస్తున్న ఓ సీనియర్ యానిమేటర్ తనపై ఒత్తిడి చేయడమే కాకుండా తన గురించి అందిరికీ తప్పుగా ప్రచారం చేయడంతో మనస్థాపం చెంది యూరియ తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం మెరుగుపడంతో వైద్యులు ఇంటికి పంపించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.